పీఎం విశ్వకర్మ లబ్ధిదారులకు ఇక్కట్లు

- కొటేషన్ తెస్తేనే రుణం.. లేకుంటే అంతే..
- ఆరు నెలలుగా తిరుగుతున్నా మంజూరు కాని లోన్
- నచ్చిన వారికి యూనిట్లు లేకున్నా రుణాలు
- జిల్లా అధికారులు పట్టించుకొని న్యాయం చేయాలని డిమాండ్



శిక్షణ తీసుకున్న లబ్ధిదారులను సన్మానిస్తున్న అధికారులు(ఫైల్)

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి యూనియన్ బ్యాంకులో పీఎం విశ్వకర్మ లబ్ధిదారులకు రుణాలు త్వరగా ఇవ్వడం లేదని, ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం కుల వృత్తులను ప్రోత్సహించేందుకు యువకులకు శిక్షణనిచ్చి ఉపాధి కోసం బ్యాంకు రుణాలను ఇప్పిస్తోంది. అయితే మండల కేంద్రంలోని మిగితా బ్యాంకులలో దరఖాస్తు చేసుకున్న వారికి రుణం మంజూరైంది. ఒక్క యూనియన్ బ్యాంకులో మాత్రం 6 నెలలుగా తిరిగినా రుణాలు ఇవ్వడం లేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. రుణం కోసం ఫ్రాంక్లింగ్ చేసుకొచ్చాక ఏబ్యాంకులో లేని విధంగా కొటేషన్ తెస్తే లక్ష రూపాయలు, లేదంటే రూ.50 వేలు ఇస్తామని మేనేజర్ తిరకాసు పెడుతున్నారని తెలిపారు. యాభైవేలు మాత్రమే ఇస్తామన్నప్పుడు లక్షకు ఫ్రాంక్లింగ్ చేయించడం ఎందుకని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. డాక్యుమెంట్ ఛార్జీలు, ఫ్రాంక్లింగ్ మొత్తం కలిపి రూ.4 వేల వరకు ఖర్చు అవుతుందని వాపోయారు. ఇవే కాకుండా నచ్చిన వారికి యూనిట్‌లు లేకున్నా పెద్ద రుణాలు మంజూరు చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీటిపై విచారణ చేసి యువకులకు లబ్ధి చేకూర్చాలని పలువురు కోరుతున్నారు. దీనిపై వివరణ కోరగా బ్యాంకు మేనేజర్ రోషన్ అగర్వాల్ నిరాకరించారు.

6 నెలలుగా రుణం ఇవ్వడం లేదు



నవంబర్ నుంచి పీఎం విశ్వకర్మ పథకం రుణం కోసం యూనియన్ బ్యాంకు చుట్టూ తిరుతున్నా ఇవ్వడం లేదు. మరో బ్యాంకుకు బదిలీ చేయడం లేదు. చివరికి మేనేజర్ లక్ష రూపాయల లోన్‌కు ఫ్రాంక్లింగ్ చేయించాలని, రూ.50 వేలు ఇస్తామని చెప్పారు. జిల్లా అధికారులు విచారణ చేసి రుణం ఇప్పించాలి.

\- జనగం దామోదర్, సెలూన్ షాప్

ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న మేనేజర్



బీసీలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రుణాల్లో మేనేజర్ ఇబ్బంది పెడుతూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడు. వారికి నచ్చిన వారికి యూనిట్‌లు లేకున్నా భారీగా సబ్సిడీ రుణాలు ఇస్తున్నారు. వీటిపై విచారణ జరిపించి పేదలకు న్యాయం చేయాలి. లేకుంటే బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేస్తాం.

\- బొనగం రాజేశం గౌడ్, బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి

పంట పొలాలకు రోడ్డు వేయండి



రోడ్డు పై నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

తిగుల్ రైతుల విజ్ఞప్తి

జగదేవ్‌పూర్(గజ్వేల్): పంట పొలాలకు వెళ్లాలంటే రోడ్డు సౌకర్యం సరిగా లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని తిగుల్ గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తిగుల్ నుంచి గజ్వేల్ మండలం వాహయిగూడ మీదుగా దాతరుపల్లి వరకు నక్షబాట(బండ్లబాట) ఉందని, మట్టి రోడ్డు కావడం వల్ల వానకాలంలో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. పంట తీసేందుకు కూలీలు రాక చుట్టూ పది కిలోమీటర్లు తిరిగి రావాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ ద్వారా మొరం పోయాలని, అలాగే బీటీ రోడ్డుగా మార్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, జిల్లా కలెక్టర్, వివిధ శాఖల అధికారులకు వినతిపత్రాలు అందించనున్నట్లు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ రాయితీని సద్వినియోగం చేసుకోండి

ములుగు(గజ్వేల్): ప్లాట్లు క్రమబద్ధీకరించే ఉద్దేశంతో 2020 సంవత్సరంలో స్వీకరించిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను ఈ నెల 31 లోగా ఫీజు చెల్లించిన వారికి 25 శాతం రాయితీ లభిస్తుందని, ఈ అవకాశాన్ని దరఖాస్తు దారులు సద్వినియోగం చేసుకోవాలని డీపీఓ దేవికదేవి సూచించారు. మంగళవారం ములుగు ఎంపీపీ కార్యాలయాన్ని సందర్శించిన ఆమె అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ నర్సింగరావు, కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

భక్తుల ఇంటికే 'భద్రాద్రి' తలంబ్రాలు

గజ్వేల్‌రూరల్/హుస్నాబాద్: భక్తుల ఇంటికే భద్రాద్రి తలంబ్రాలను పంపించేందుకు ఆర్టీసీ శ్రీకారం చుట్టిందని గజ్వేల్‌–ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ పవన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం డిపో ఆవరణలో తలంబ్రాల బుకింగ్ రశీదులను ప్రదర్శించి మాట్లాడుతూ గజ్వేల్‌లోని ఆర్టీసీ బస్టాండ్‌లోని కార్గో లాజిస్టిక్స్ వద్ద భక్తులు రూ. 151 చెల్లించి బుకింగ్ చేసుకున్న వారికి సీతారాముల కల్యాణం తలంబ్రాలను వారి ఇళ్ల వద్దనే అందిస్తామని తెలిపారు. హుస్నాబాద్ బస్టాండ్ కార్గో ఆఫీస్‌లో కళ్యాణ తలంబ్రాలు అందుబాటులో ఉంటాయని, రూ.151 చెల్లించి తీసుకోవాలని డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

కుటుంబమే విద్యార్థుల వికాసానికి పునాది

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థుల వికాసానికి పునాది కుటుంబం నుంచే పడుతుందని ప్రముఖ మనోవికాస శాస్త్రవేత్త, విద్యా కౌన్సిలర్ డాక్టర్ వీరేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నూతన ఉన్నత పాఠశాల వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పిల్లలకు కుటుంబంలో సరైన భోజనం, దుస్తులు అందించడం ముఖ్యం కాదని వారు ఎదుగుతున్న తీరును పరిశీలించాలన్నారు. వారి వికాసానికి అవరోధమైన పరిస్థితులను దూరం చేయడమే ముఖ్యమన్నారు. విద్యార్థులు సెల్ ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండాలని, లక్ష్యాన్ని బాల్యంలోనే ఏర్పర్చుకొని అందుకు తగిన సాధన చేస్తే గమ్యాన్ని చేరుతారని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న మనో వికాస శాస్త్రవేత్త వీరేందర్

ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ రిటైర్డ్ ఇంజినీర్ కిషన్, టూటౌన్ సీఐ ఉపేందర్, జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్, ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భగీరథ నీటిని వృథా చేయొద్దు

ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రుహీనా తస్కీన్

అక్కన్నపేట(హుస్నాబాద్): గ్రామాల్లో ప్రభుత్వం ఇంటింటికీ సరఫరా చేస్తున్న మిషన్ భగీరథ తాగునీటిని వృథా చేయొద్దని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రుహీనా తస్కీన్ అన్నారు. అక్కన్నపేట మండలం గండిపల్లి, అంబనాయక్ తండా, సరిరాం తండా గ్రామాల్లో మంగళవారం నీటి సరఫరాను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పైపులైన్ లీకేజీ, వృథాగా నీళ్లు పోయినా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. పైపులైన్లు పగలగొట్టి, వ్యవసాయ పొలాలకు భగీరథ నీరు పారిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంపత్‌కుమార్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

గజ్వేల్‌రూరల్: నూతన విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే ముందస్తుగా అడ్మిషన్లు చేపడుతున్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఎస్ఎఫ్ఐ గజ్వేల్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఎంఈవో కృష్ణకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రస్తుత విద్యాసంవత్సరం పూర్తికాక ముందే జిజ్ఞాస హైస్కూల్‌తో పాటు మరికొన్ని విద్యాసంస్థలు అడ్మిషన్లను స్వీకరిస్తున్నాయని, పలుమార్లు విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రవీణ్‌కుమార్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం

మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి

గజ్వేల్: రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ధర్మారెడ్డిపల్లి గ్రామంలో మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం బీసీ బిల్లు, ఎస్సీ రిజర్వేషన్ ఆమోదం, రాజీవ్ యువ వికాసం పథకం ప్రారంభంపై హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రమేశ్‌బాబు, మార్కెట్ కమిటీ కార్యదర్శి జాన్‌వెస్లీ, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్

అక్కన్నపేట(హుస్నాబాద్): సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్ అన్నారు. అక్కన్నపేట మండల పరిధిలోని కేశవాపూర్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలపై, మహిళా చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫోన్‌లో ఎవరైనా బ్యాంకు ఖాతాల వివరాలు లేదా ఓటీపీ అడిగితే ఎట్టి పరిస్థితుల్లో చెప్పొద్దని, ఫోన్ లేదా మెయిల్ ద్వారా వచ్చే వెబ్‌సైట్ లింకులను ఓపెన్ చేయవద్దన్నారు. అలాగే మసిరెడ్డితండా గ్రామ పరిధిలోని ర్యాగటోని పల్లెలో కళాకారులతో కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ విజయ్‌భాస్కర్, ఏఎస్ఐ రామ్మూర్తి, కానిస్టేబుల్స్, కళాకారులు పాల్గొన్నారు.



అక్కన్నపేట(హుస్నాబాద్): మాట్లాడుతున్న సీఐ

నూతన చట్టాలపై అవగాహన అవసరం

దుబ్బాకటౌన్: విద్యార్థులకు రక్షణ చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన అవసరమని దుబ్బాక సీఐ శ్రీనివాస్ అన్నారు. మంగళవా రం దుబ్బాక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో నూతన పోలీస్ చట్టాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

ప్రతిరోజు ప్రశాంతమైన నిద్ర అవసరం

సిద్దిపేటకమాన్: ప్రతి వ్యక్తికీ రోజు సుమారు 6 నుంచి 8 గంటల ప్రశాంతమైన నిద్ర అవసరమని సిద్దిపేట ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శాంతి తెలిపారు. వరల్డ్ స్లీప్ డే సందర్భంగా ఆసుపత్రిలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శాంతి మాట్లాడుతూ.. మనిషికి నిద్ర ఎంత అవసరమో దాని ప్రాముఖ్యతను తెలుసుకొని వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. నిద్ర కోసం ఎలాంటి మందులు వాడకూడదని, పడుకునే ముందు సెల్‌ఫోన్‌లను దూరంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సంధ్య, ఆర్ఎంఓలు డాక్టర్ జ్యోతి, డాక్టర్ శ్రావణి, డాక్టర్ సదానందం, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ శాంతి

బీసీ బిల్లు ఆమోదంపై హర్షం

మిరుదొడ్డి(దుబ్బాక), బెజ్జంకి(సిద్దిపేట): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లును శాసన సభలో ప్రవేశపెట్టి ఆమోదం తెలపడం పై పలువురు హర్షం వ్యక్తం చేశారు. దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాతూరి వెంకట్ స్వామి గౌడ్ ఆధ్వర్యంలో బీసీ బిల్లుపై హర్షం వ్యక్తం చేస్తూ అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కమలాకర్, మండల మహిళా అధ్యక్షురాలు సుమలత, నాయకులు పాల్గొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లుకు సహకరించిన సీఎం, మంత్రులు, నాయకులకు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి బొనగం రాజేశం మంగళవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ హరికృష్ణ ఆధ్వర్యంలో ముస్తాబాద్ చౌరస్తాలో సీఎం, మంత్రులు కొండ సురేఖ, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు.



మాట్లాడుతున్న వెంకట్ స్వామి గౌడ్

చిన్నారులకు సాయం



చిన్నారులకు నిత్యావసర సరుకులు అందజేసిన అరికెపూడి రఘుసేవా ట్రస్ట్ సభ్యులు

తొగుట(దుబ్బాక): ఆర్థిక సమస్యలతో తల్లిదండ్రులు ఆత్మహత్యకు పాల్పడగా అనాథలైన చిన్నారులను పలువురు మంగళవారం పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. మండలంలోని ఎల్లారెడ్డిపేట కెమ్మసారం నాగరాజు, భాగ్యలక్ష్మి దంపతులు ఆదివారం ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. కాగా వారి పిల్లలను తొగుట సీఐ లతీఫ్ పరామర్శించి రూ.5వేలు సహాయం అందజేశారు. పత్రికల ద్వారా చిన్నారుల పరిస్థితిని తెలుసుకున్న హైదరాబాద్ అరికెపూడి రఘుసేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో చిన్నారులకు నిత్యావసర సరుకులు అందజేశారు. చిన్నారులను హాస్టల్‌లో ఉంచి చదివించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో తొగుట ఎస్ఐ రవికాంత్‌రావు, ఎల్లారెడ్డిపేట మాజీ ఎంపీటీసీ స్వామి, బాలల పరిరక్షణ కౌన్సిలర్ నర్సింలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్త పీఆర్సీని అమలు చేయాలి

తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రిటైర్మెంట్ బెనిఫిట్, డీఏలు, పీఆర్సీ కోసం కోర్టుకెళ్లాల్సిన పరిస్థితి ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొందని, తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో హనుమంతరావు మాట్లాడారు. తెలంగాణలో తప్ప దేశంలోని ఏ రాష్ట్రంలో 5 డీఏలు పెండింగ్‌లో లేవన్నారు. జూలై వస్తే ఉద్యోగులకు మరో డీఏ, మొత్తంగా 6 డీఏలు బాకీ పడ్డట్టేనన్నారు. 2023 జూలై 1 నుంచి కొత్త పీఆర్సీ అమలు చేయాల్సి ఉన్నా అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి భాస్కర్, శ్రీనాకర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మురళీధర్ పాల్గొన్నారు.

పవర్ ప్లాంట్‌ను సందర్శించిన విద్యార్థులు

సిద్దిపేటఎడ్యుకేషన్: విద్యార్థులు సెల్‌ఫోన్‌తో కాలక్షేపాన్ని తగ్గించి విషయ పరిజ్ఞానం పై దృష్టి సారించాలని మల్లన్న సాగర్ హైడ్రో పవర్ ప్లాంట్ డిప్యూటీ ఈఈ శ్రీనివాసరావు అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల బీఎస్సీ ఫైనలియర్ ఫిజిక్స్ విద్యార్థులు మంగళవారం మల్లన్న సాగర్ జలవిద్యుత్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డిప్యూటీఈఈ శ్రీనివాసరావు, గైడ్ టీచర్ కృష్ణయ్యలు విద్యార్థులకు పవర్ ప్లాంట్ గూర్చి వివరించారు. కార్యక్రమంలో పరిశోధక విద్యార్థులు శివాని, కీర్తన, బీరప్ప, పూజిత, వెన్నెల, మానస, సార్థక్, కార్తీక్ పాల్గొన్నారు.

స్వదేశానికి గల్ఫ్ మృతదేహం

కోహెడరూరల్(హుస్నాబాద్): కరీంనగర్ ఎంపీ, కేంద్ర సహాయక హోంమంత్రి బండి సంజయ్ చొరవతో సౌదీ అరేబియాలో మృతి చెందిన కోహెడ మండలంలోని శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన జాలిగం అశోక్ మృతదేహం స్వగ్రామానికి రావడానికి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఫిబ్రవరి 9న అశోక్ మృతి చెందగా స్థానిక బీజేపీ నాయకులతో విషయం తెలుసుకున్న బండి సంజయ్ సౌదీ అరేబియా ప్రతినిధులతో మాట్లాడి అశోక్ మృతదేహాన్ని మార్చి 21 రోజున హైదరాబాద్ ఎయిర్ పోర్టుకు వచ్చేట్లు కృషి చేశారు.

క్లుప్తంగా

గురువులను మరువొద్దు

దుబ్బాకటౌన్: విద్యార్థులు జీవితంలో ఏ స్థాయిలో ఉన్నా చదువు నేర్పిన గురువులను, పాఠశాలను మరువకూడదని మండల విద్యాధికారి జోగు ప్రభుదాస్ అన్నారు. మంగళవారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని దుంపలపల్లి ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులున్నారు.

వెనుకబడిన విద్యార్థులకు ఏఐతో బోధన

మద్దూరు(హుస్నాబాద్): చదువులో వెనుకబడిన విద్యార్థులకు కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)తో బోధన అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నదని ఎంఈవో వరదరాజు అన్నారు. మంగళవారం మండలంలోని మర్మాముల గ్రామంలోని పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఏఎక్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి వెనుకబడిన పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా బోధన చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భాస్కర్, ఉపాధ్యాయులు వనజ, తదితరులు పాల్గొన్నారు.

నేడు పద్యకవి సమ్మేళనం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట పట్టణంలోని హరిహర రెసిడెన్సీ సమీపంలోని లలిత చంద్రమౌళీశ్వర దేవాలయంలో ఉగాదిని పురస్కరించుకొని బుధవారం పద్యకవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు పండరి రాధాకృష్ణ, బాలసాహితీవేత్త ఉండ్రాళ్ల రాజేశం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కవులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు.

నేడు ఇండస్ట్రియల్ పార్కుపై గ్రామ సభ

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం చౌటపల్లి గ్రామంలో ఇండస్ట్రియల్ పార్కు నిర్మాణం కోసం భూములు కోల్పోతున్న రైతులతో బుధవారం గ్రామసభ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ అనంతరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ గ్రామంలో 83.36 ఎకరాల భూమిలో టీజీఐఐసీ పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదించబడిందని తెలిపారు. 2013 సెక్షన్ 11(1) చట్టం ద్వారా భూ నష్టపరిహారం చెల్లించడానికి నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. ఉదయం 10.30 గంటలకు గ్రామసభ ప్రారంభమవుతుందని, రైతులు రావాలని సూచించారు.

ఉద్యోగుల బకాయిలు విడుదల చేయాలి

మద్దూరు(హుస్నాబాద్): రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ ఉద్యోగులకు బకాయి పడిన ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలని డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బాకీ చంద్రభాను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని రేబర్తి గ్రామంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో ఉపాధ్యాయ ఉద్యోగుల ప్రతి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి నేటికీ 15 నెలలు గడిచినా ఒక్క సమస్యను పరిష్కరించక పోవడం బాధాకరమన్నారు. పెండింగ్‌లో ఉన్న దాదాపు రూ.8వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ మండల అధ్యక్షుడు నరసింహులు, మల్లేశం, సంపత్ పాల్గొన్నారు.

వర్గల్ ఎంపీడీఓగా మశ్చేందర్



వర్గల్(గజ్వేల్): వర్గల్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీఓ)గా ఎం. మశ్చేందర్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. మ్యూచువల్ బదిలీలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం నుంచి ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను ఎంపీఓ ఖలీమ్, సిబ్బంది ఘనస్వాగతం పలికారు.

21న అంగడి బహిరంగ వేలం

హుస్నాబాద్: పట్టణంలో ప్రతి శుక్రవారం నిర్వహించే వారాంతపు సంత బహిరంగ వేలం ఈ నెల 21న నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17న నిర్వహించిన వారాంతపు సంత వేలంను అనివార్య కారణాలతో వాయిదా వేశారు. వేలంలో పాల్గొనే కాంట్రాక్టర్లు ఈ నెల 20న సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులు మున్సిపల్ కార్యాలయంలో అందజేయాలని కమిషనర్ సూచించారు.

అడవిపంది హల్‌చల్

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని మర్రిముచ్చాలలో మంగళవారం సాయంత్రం అడవిపంది హల్‌చల్ చేసింది. దీంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. స్థానికుల కథనం ప్రకారం... మంగళవారం సాయంత్రం అడవిపంది సమీప వ్యవసాయ పొలాల నుంచి గ్రామంలోకి వచ్చి వంగ రఘుపతిరెడ్డి ఇంట్లోకి చొరబడింది. వెంటనే వారు బయటకు వచ్చి గడియపెట్టి, వల సహాయంతో బంధించి, గ్రామం బయట వదిలిపెట్టారు. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ గత పాలకులే కారణం

బెజ్జంకి(సిద్దిపేట): పదేండ్ల పాలనలో కాలువల నిర్మాణం కోసం భూసేకరణ చేయకపోవడమే జాప్యానికి కారణమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గుండారంలో మంగళవారం ఎండిన వరి పంటలను పరిశీలించారు. కార్య క్రమంలో ఏఎంసీ చైర్మన్ కృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ ప్రభాకర్, పోచయ్య, శ్రీకాంత్, రాములు, శంకర్, కుమార్, మధుసూదన్‌రెడ్డి, నర్సయ్య పాల్గొన్నారు.

◆ వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి

మద్దూరు(హుస్నాబాద్): ఉపాధి హామీ కూలీలు వేసవిలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి మాధవ్‌జాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని రేబర్తి గ్రామంలో ఉపాధిహామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం పనులకు రావాలని సూచించారు.

◆ బీఆర్ఎస్ యూత్ నాయకుల అరెస్ట్

బెజ్జంకి(సిద్దిపేట): ఉస్మానియా యూనివర్సిటీలో ధర్నాలను నిరాకరించినందుకు బీఆర్ఎస్ యూత్ ఆధ్వర్యంలో చేపట్టిన అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న క్రమంలో మండల యూత్ నాయకులను మంగళవారం బెజ్జంకి పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు మోహన్, మహేశ్,అజయ్, నవీన్, అనీల్ పాల్గొన్నారు.

◆ గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

జగదేవ్‌పూర్(గజ్వేల్): గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఎంపీటీసీ మంజుల మహేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని తిగుల్ గ్రామంలో రూ. 20 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులు మంగళవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. కీర్యక్రమంలో నాయకులు దయానంద్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం..పట్టణంలోని పలు ప్రాంతాల్లో కొన్ని రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో ఐదు మంది పట్టుబడ్డారు. సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.6,500 జరిమానా, ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష విధించారు.

గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో..

గజ్వేల్‌రూరల్: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి పేర్కొన్నారు. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన చౌరస్తాల వద్ద ఇటీవల నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 17మంది మద్యం తాగి వాహనాలు నడిపారని తెలిపారు. ఈ సందర్భంగా వారిని మంగళవారం కోర్టులో హాజరు పర్చగా విచారణ అనంతరం 17మందికి రూ. 13వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

◆ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకంను యువత సద్వినియోగం చేసుకోవాలని, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కిరణ్‌కుమార్ రావు అన్నారు. ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరిస్తుందని తెలిపారు.

◆ మల్లన్నసాగర్‌లో చేపలు పట్టేందుకు లైసెన్సులు

గజ్వేల్‌రూరల్: మల్లన్నసాగర్‌లో చేపలు పట్టేందుకు అర్హులైన ముదిరాజ్‌లకు లైసెన్సులను అందజేశామని మత్స్య సహకార సంఘం జిల్లా డైరెక్టర్ అక్కారం సత్తయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీలోగల పల్లెపహాడ్‌కు చెందిన 92 మంది ముదిరాజ్‌లకు, మత్స్యకారులకు లైసెన్సులను అందించారు.